క్లుప్తంగా

స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

నెల్లిమర్ల: నగర పంచాయతీకి సంబంధించి లెగసీ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు సారిపల్లి ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలో అధికారులు గురువారం స్థల పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, ఏఈ త్రినాథ్, ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



భరతనాట్య ప్రదర్శన

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్థానిక మూడులాంతర్లు వద్ద నున్న చదురుగుడి ఆవరణలో డి.వీరరాఘవమ్మ నృత్య కళాకేంద్రానికి చెందిన విద్యార్థినులు చేసిన భరతనాట్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం దుక్కశాంతి బృందం చేసిన శ్రీకోదండ రామాలయ కోలాట ప్రదర్శన రక్తి కట్టించింది. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడి ఆవరణలో సీహెచ్ అగ్రహారానికి చెందిన గుడివాడ లక్ష్మీనారాయణ, అంబటివలసకు చెందిన బొద్దూరి జగన్నాథం, మద్దికి చెందిన సింగిరెడ్డి గైరీశ్వరి, సామవేదం బాలసుబ్రహ్మణ్యం ఏకపాత్రాభినయాలు అలరించాయి. అనంతరం కళాకారులను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఘనంగా సత్కరించారు.

ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట పోస్టాఫీస్ వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు పిలుపునిచ్చారు. తపాలా వారోత్సవాల్లో భాగంగా జరజాపుపేటలో గురువారం ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ పోస్టుమాస్టర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, శుక్రవారం కూడా క్యాంప్ కొనసాగుతుందని.. వినియోగదారులు ఆధార్‌లోని లోపాలను సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అవనాపు సత్యనారాయణ, నల్లి శ్రీను, టి. నారాయణమూర్తి, ఎంఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనపై శిక్షణ

విజయనగరం రూరల్: పంచాయతీల పాలనపై ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండో రోజైన గురువారం కూడా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ, పంచాయతీరాజ్ చట్టాలు, పంచాయతీ పాలనపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పంచాయతీ పరిపాలనలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఎంపీడీఓ చంద్రకళ మాట్లాడుతూ.. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. అలాగే తాగునీరు, పారిశుధ్యం పనులు చురగ్గా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వార్డు మెంబర్లు అడిగిన పలు సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో 12 గ్రామాలకు సంబంధించిన వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పూసపాటిరేగ: మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో స్కావెంజర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బి.పాపినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఒక స్కావెంజర్ ఉద్యోగాన్ని అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వయసు ఓపెన్ క్యాటగిరీ అభ్యర్థులకు 42 ఏళ్లు కాగా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగి ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 15వ తేదీ లోగా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

23న నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు

విజయనగరం ఫోర్ట్: ఏపీ నర్సింగ్ అసోసియేషన్ విజయనగరం యూనియన్‌కు ఈనెల 23న ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రిజ్వాన్ షరీఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నోటీస్ బోర్డులో వివరాలను ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 14న ఎన్నికల నోటీస్ ఇస్తామన్నారు. 16వ తేదీన నామినేషన్ల స్వీకరణ, 17న పరిశీలన, 18న నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుందని తెలిపారు. 23న పోలింగ్ నిర్వహిస్తామన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ..

- ఈ నెల 12 నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు
- పైడితల్లి, చదురుగుడి పరిసరాలపై ప్రత్యేక దృష్టి
- సిరిమానోత్సవంలో 150 మంది సిబ్బందితో రోడ్లు శుభ్రత



పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

విజయనగరం: విజయనగరం ప్రజల ఇలవేల్పు, ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి జాతర మహోత్సవానికి సమయం ఆసన్నమైంది. మరో మూడు రోజుల వ్యవధిలో అమ్మవారి తొలేళ్ల ఉత్సవంతో పాటు సిరిమానోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణపై ప్రణాళికలు సిద్ధం చేశారు. అమ్మవారి సిరిమాను సంబరానికి రెండు రోజుల ముందు దసరా పండగ జరగనుండడం, మరుచటి రోజు ఆదివారం నుంచి విజయనగరం ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో నగరానికి భక్తులు, సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ నెల 12 నుంచి భక్తుల రద్దీ ఉంటుందన్న అంచనాల మేరకు అదేరోజు నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నారు. అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, సిరిమానోత్సవం రోజుల్లో ఆలయ పరిసరాల్లో 24 గంటల పాటు నిరంతరాయంగా పారిశుధ్య పనులు చేపట్టనున్నారు.

అదనపు సిబ్బంది నియామకం..

దసరా పండగ నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి జాతర మహోత్సవాల్లో నగరంలో పారిశుధ్య నిర్వహణపై కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. నగర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా అనదపు సిబ్బందిని నియమించనుంది. అధికారిక లెక్కల ప్రకారం కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగంలో 650 మంది సిబ్బంది రెగ్యులర్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తుండగా... అందులో 100 మంది వరకు సిబ్బంది అదే విభాగంలో వేర్వేరు పనులు చేపడుతుండడంతో ప్రస్తుతం 540 మంది మాత్రమే పారిశుధ్య పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాల సందర్భంగా 990 మంది అదనపు సిబ్బందిని నియమించనున్నారు. నాలుగు రోజుల పాటు విధులు నిర్వహించే వీరికి రోజుకు రూ.590 చొప్పున రూ.2.33 లక్షలు ఖర్చు చేయనున్నారు.

విజయనగరం ఉత్సవాల వేదిక వద్ద..

ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే విజయనగరం ఉత్సవాల వద్ద పారిశుధ్య సేవలందించేందుకు అవసరమైన సిబ్బందిని కేటాయించారు. రెండు రోజుల పాటు 14 వేదికల్లో నిర్వహించే ప్రాంగణాలను ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో శుభ్రం చేయనున్నారు. ఈ పనులను సచివాలయ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దగ్గరుండి పర్యవేక్షించనున్నారు.

సిరిమానోత్సవంలో 150 మంది సిబ్బందితో సేవలు

అమ్మవారి జాతరలో కీలక ఘట్టమైన సిరిమానోత్సవంలో 150 మంది సిబ్బందిని రోడ్లు శుభ్రం చేసేందుకు వినియోగించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఉత్సవంలో భాగంగా పూజారి అధిరోహించే సిరిమాను అమ్మవారి చదురుగుడి నుంచి కోట వరకు మూడుసార్లు తిరుగుతూ భక్తులకు దర్శనమివ్వనుంది. ఈ నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు అరటిపళ్లు, పసుపు, కుంకుమలను సిరిమాను వైపు విసిరి తమ మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఇలా భక్తులు విసిరిన అరటిపళ్లను కేటాయించిన సిబ్బందితో శుభ్రం చేయడంతో పాటు ప్రత్యేక వాహనాల ద్వారా తరలించనున్నారు.

ఇబ్బందుల్లేకుండా చర్యలు..

ఈ నెల 12 నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడతాం. పండగ రోజుల్లో నగరంలో అపారిశుధ్యానికి తావు లేకుండా ప్రత్యేక సిబ్బందితో పనులు నిర్వహిస్తాం. అమ్మవారి ఆలయ పరిసరాల్లో నిరంతరాయంగా పారిశుధ్య పనులు కొనసాగుతాయి. అంతేకాకుండా విజయనగరం ఉత్సవాల వేదికల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేశాం.

– డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ప్రజారోగ్యాధికారి, విజయనగరం కార్పొరేషన్.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

- డాక్టర్ సాయిరామ్

నెల్లిమర్ల రూరల్: ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ వీలైనంతవరకు ఒత్తిడికి దూరంగా ఉండాలని సతివాడ పీహెచ్‌సీ డాక్టర్ సాయిరామ్ అన్నారు. మండలంలోని సతివాడలో ప్రపంచ ఆరోగ్య మానసిక దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్లినికల్ సైకాలజిస్ట్ రాజు మానసిక రోగులను తనిఖీ చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. మానసిక ఒత్తిడి, లక్షణాలు, పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది మంగమ్మ పాల్గొన్నారు.



సతివాడ పీహెచ్‌సీ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఉత్సవాలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

- మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం పైడితల్లి ఉత్సవాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నగర పాలక సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీలో ఐదు అంశాలతో కూడిన టేబుల్ అజెండాకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా స్టాండింగ్ కమిటీ సభ్యుడు రాజేష్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థలో చేపట్టిన ప్రతి పనికీ మేయర్ అనుమతి తప్పనిసరిగా ఉండాన్నారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఈనెల 13, 14, 15వ తేదీలలో జిల్లా యంత్రాంగం నిర్వహిస్తున్న పైడితల్లి పండగ ఘనంగా జరగాలని ఆకాంక్షించారు. నగరాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.50 లక్షలతో పెయింటింగ్ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కమిషనర్ నల్లనయ్య, సహాయ కమిషనర్ తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు రేగాన రూప, అల్లు చాణక్య, ఎస్.నారాయణస్వామి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చందకపేటలో అన్నసమారాధన



అన్న ప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పొంద్రంకి ఆదినారాయణ, తదితరులు

దెంకాడ: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చందకపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పొంద్రంకి ఆదినారాయణ ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు హాజరై అమ్మ ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో పొంద్రంకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జీఆర్ పాలెంలో..

పూసపాటిరేగ: మండలంలోని జీఆర్‌పాలెంలో శరన్నవరాత్రుల సందర్భంగా అన్నదానం నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూనిశెట్టి గోవింద, జలపార శివ, శాంతాటి శ్రీనివాసరావు, జలపార శ్రీను, బాలా అప్పలరాజు, నక్కాన రమణ, దేశెట్టి గణేష్, చాపల సత్తిబాబు, సత్యం మాస్టారు పాల్గొన్నారు.

సారిపల్లిలో గ్రామసందర్శన



గ్రామసభలో సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి కూర్మారావు

నెల్లిమర్ల రూరల్:

మండలంలోని సారిపల్లిలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి టి. కూర్మారావు, సిబ్బందితో గ్రామంలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్‌డిపోను పరిశీలించి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో ప్రత్యేకాధికారి కూర్మారావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ స్థాయి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి కనీస అవసరాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ రాయి ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు తాత్కాలిక బ్రేక్

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు తాము చేపట్టనున్న సమ్మెకు తాత్కాలిక బ్రేక్ ఇచ్చారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై గురువారం సాయంత్రం స్థానిక మున్సిపల్ ప్రజారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో కార్మికులు తెలియజేసిన సమస్యలపై ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి సానుకూలంగా స్పందించారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో యూనియన్ నాయకులు తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. చర్చల్లో ఏపీ మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు రంగరాజు, జలగడుగుల కామేష్, పాడుగు రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ అధికారితో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- ఎన్‌సీసీ క్యాడెట్స్ ఇంటరాక్టివ్ సెషన్‌లో డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: దేశ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని, ఆ దిశగా కళాశాల స్థాయి నుంచే విద్యార్థులు తయారు కావాలని సత్య విద్యా సంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు అన్నారు. సీతం ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో జరుగుతున్న కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్లతో గురువారం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సేవలో ఎన్‌సీసీ క్యాడెట్లు పోషించాల్సిన బాధ్యత గురించి వివరించారు. క్యాడెట్స్‌కి ఉత్తేజాన్ని అందిస్తూ, భవిష్యత్‌లో దేశసేవకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన్ను ఎన్‌సీసీ క్యాడెట్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి, క్యాంప్ కమాండెంట్ తపస్ మండల్, డిప్యూటీ కమాండెంట్ పల్లవివర్మ, సుబేదార్ మేజర్ అనిల్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు మేజర్ శ్రీనివాసరావు, కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ కృష్ణకిషోర్, లెఫ్టినెంట్ దినేష్, లెఫ్టినెంట్ లక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, సతీష్, సీఎస్ఓ కె. సత్యనారాయణ, పీడీ మహేశ్వరరావు, 500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



సత్కారం పొందిన సత్యా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావుతో నిర్వాహకులు

సీసీ రోడ్డు వేయలేదు..

- 12వ డివిజన్ వార్డు పర్యటనలో అధికారులకు దృష్టికి సమస్యలు

విజయనగరం: తమ ప్రాంతంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల్లో భాగంగా కాలువలు నిర్మించి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వదిలేశారని 12వ డివిజన్‌కు చెందిన పలువురు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వార్డు పర్యటనలో భాగంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు 12వ డివిజన్‌లో గురువారం పర్యటించారు. ఇప్పిలివీధి జంక్షన్ నుంచి ప్రారంభమైన వార్డు పర్యటన వివిధ ప్రాంతాలలో సాగింది. స్థానిక సమస్యలను ప్రజలు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు మాట్లాడుతూ.. నగరంలో ప్రతి గురువారం వార్డు పర్యటనలు చేపడుతున్నామన్నారు. ప్రజలు తెలియజేస్తున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ కార్పొరేటర్ రేగాన రూపాదేవి మాట్లాడుతూ.. తమ డివిజన్‌లో కాలువల నిర్మాణాలు చేపట్టి సీసీ రోడ్డు వేయలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారన్నారు. అలాగే స్థానికులు తెలియజేసిన పలు సమస్యలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈ సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న అసిస్టెంట్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్ రేగాన రూపాదేవి, తదితరులు

యూటీఎఫ్ నేత నారాయణకు నివాళులు

విజయనగరం అర్బన్: యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నాగటి నారాయణ ద్వితీయ వర్ధంతి స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది సంఘ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డి. రాము, జేఏవీఆర్ కె. ఈశ్వరరావు, కె శ్రీనివాసరావు, ఎన్. సత్యనారాయణ, కె.ప్రసాదరావు, పి. వాసుదేవరావు, జి.రాజారావు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో ఎంతో మేలు

నెల్లిమర్ల: గ్రామాభివృద్ధికి శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఎంపీడీఓ కె. రామకృష్ణరాజు అన్నారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారంతో పూర్తయింది. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ జగన్నాథం, ఏఓ సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

• జయహో దుర్గా భవానీ..



పూసపాటిరేగ: దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం రూరల్: కేఎల్‌పురంలో దుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న భవానీ భక్తులు



విజయనగరం టౌన్: సీఎంఆర్ జంక్షన్ సమీపంలో నవదుర్గలకు పూజలు



విజయనగరం టౌన్: ప్రత్యేక అలంకరణలో వనంగుడి పైడితల్లి అమ్మవారు

గ్రామాలు, పట్టణాలన్నీ జయహో దుర్గా భవానీ నామస్మరణతో హోరెత్తాయి. శరన్నవరాత్రుల్లో భాగాంగా ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గాదేవికి గురువారం విశేష పూజలు చేపట్టారు. పలు చోట్ల అన్నదానాలు ఏర్పాటు చేయగా.. మరికొన్ని చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గమ్మకు పలువురు సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కేంద్రంలో లేడీస్ రిక్రియేషన్ క్లబ్ సభ్యులు పదేళ్ల లోపు చిన్నారులను అమ్మవారి స్వరూపంగా భావించి పూజలు చేశారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



నెల్లిమర్ల రూరల్: ఒమ్మిలో అమ్మవారి సన్నిధిలో నవదుర్గ హోమాన్ని జరిపిస్తున్న అర్చకులు



నెల్లిమర్ల రూరల్: కొత్తపేటలో దుర్గమ్మకు సారె తీసుకువస్తున్న భక్తులు



ఫొటోగ్రాఫర్ : లేడీస్‌క్లబ్‌లో చిన్నారులకు కాళ్లు కడిగి పూజలు చేస్తున్న సభ్యులు